తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
సోమవారం
16 ఫిబ్రవరి 2026
పేజీలు : 8
Follow :

## మాడుగులపల్లిలో నరకం చూస్తున్న

# ప్రయాణికులు






✧ ఓట్లప్పుడు వచ్చే నాయకులు కష్టాల్లో ఎక్కడ

మాడుగులపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 15 జనం సాక్షి: అధికార గర్వంతో నాయకులు, ఏమీ పట్టనట్టు అధికారులు వెరసి మాడుగులపల్లి మండల కేంద్రం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది అభివృద్ధి అంటే రంగుల గోడలు, పత్రికా ప్రకటనలు కాదని, కనీసం మనుషులు వెళ్లడానికి ఒక టాయిలెట్ లేని ఈ దుస్థితిని చూసి ప్రజలు ఛీత్కరించుకుంటున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం పాలకుల వైఫల్యం**

నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే మాడుగులపల్లి సెంటర్లో ప్రయాణికుల గోడు వినే నాథుడే కరువయ్యారు. మహిళల అవస్థలు వర్ణనాతీతం బహిరంగంగా చెప్పుకోలేక, అటు వెళ్లడానికి టాయిలెట్స్ లేక మహిళా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే సిగ్గుతో తలదించుకోవాలి స్వచ్ఛ భారత్ నినాదాలు కేవలం కాగితాలకే పరిమితమా అని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నాయకులకు కనిపించడం లేదా ఖరీదైన కార్లలో ఇదే సెంటర్ గుండా వెళ్లే రాజకీయ నాయకులకు పక్కనే ఉన్న ప్రయాణికుల కష్టాలు కనిపించడం లేదా లేక తెలిసి కూడా కళ్ళు మూసుకుంటున్నారా.ఓట్ల కోసం వస్తారు సౌకర్యాలు అడిగితే ముఖం చాటేస్తారు ఎన్నికల సమయంలో గ్రామ గ్రామాన తిరుగుతూ హామీల వర్షం కురిపించే ప్రజాప్రతినిధులు మండల కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాల కల్పనలో ఘోరంగా మిగతా 8లో

## గ్రామీణ క్రీడా స్థాయిలోని ప్రతిభకు గుర్తింపు

### కలెక్టర్ బి చంద్రశేఖర్



**కనగల్లు, ఫిబ్రవరి 15 (జనంసాక్షి)**

గ్రామీణ స్థాయిలో నే క్రీడాకారుల ప్రతిభకు గుర్తింపునిస్తాయని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో సీఎం కప్ క్రీడా పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలను క్రీడాకారులకు సరైన వేదికలు లేనందుని ఉత్సాహం ఉన్న క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనలేక పోతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు మనోధైర్యాన్ని కలిగి మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతి క్రీడలు తమ ప్రతిభను ముందుకు తీసుకెళ్తారని తెలియజేశారు. క్రీడలలో పాల్గొని ప్రతి వ్యక్తి జట్టు భావన, నాయకత్వ లక్షణాలు కలుగుతాయని కలెక్టర్ గుర్తు చేశారు. సీఎం కప్ పోటీలలో విజేతలు అయిన ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయిలో జిల్లా పేరును నిలబెట్టిన వారవుతారని తెలియజేశారు. హాకీ, వాలీబాల్, టైక్వాండో, క్రికెట్, ఫుట్బాల్, కోకో లాంటి పోటీలలో పాల్గొని ప్రతి క్రీడాకారునికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా యువజన అధికారి అక్బర్ అలీ, నల్లగొండ తాసిల్దార్ పరుశురాం, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నీలాద్రీశ్వరుని దర్శించుకున్న వేలాది మంది భక్తులు

### భక్తులతో కిటకిటలాడిన గుడి ప్రాంగణం



**పెనుబల్లి, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం నీలాద్రి దేవస్థానానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో గుడి ప్రాంగణం కిటకిట లాడింది. భక్తులు తెల్లవారుజామునుండే నీలాద్రి కి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివపార్వతులను దర్శించుకున్నారు,మరి కొంతమంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్నటువంటి కోనేటి లో స్నానాలు ఆచరించి దైవ దర్శనం తో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. భవన్న పాలెం అటవీ ప్రాంతంలో గల ఈ దేవస్థానానికి ప్రతి ఏడాది ఖమ్మం, చుట్టుపక్కల జిల్లాల నుండి భక్తులు వేలాదిగా తరలివస్తారు. నీలాద్రి తిరునాళ్లకు, శివ పార్వతుల కళ్యాణ మహోత్సవానికి భక్తులు విశేషంగా హాజరవుతారు.

**ఆలయ కమిటీ నిర్వాకం పై భక్తుల ఆగ్రహం**

భక్తులకు కనీసం మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారని భక్తులు కమిటీ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య దర్శనంలో కమిటీ నిర్లక్ష్యం మూలంగా భక్తుల రద్దీ పెరిగి దర్శనం మరింత జాప్యం అయిందని, భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ, నిర్వాహకులపై భక్తులు ఏకంగా చేతకాని కమిటీ అని తీవ్రఅసంతృప్తిని వ్యక్తం చేశారు. విఐపి పాసులు ఇష్టానుసారంగా జారీచేసి. సామాన్య భక్తులకు తీవ్రమైన అసౌకర్యాన్ని కలిగిస్తున్నారని ఆలయ నిర్వహకులపై భక్తులు మండిపడుతున్నారు.

## పరమశివుని చెంత మంత్రి పొంగులేటి దంపతులు

❍ముక్కంటి సన్నిధిలో ఆధ్యాత్మిక పర్యటన

❍తీర్థాల, సంఘమేశ్వరుని ఆలయం లో కుటుంబ సమేతంగా పూజలు



**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** మహాశివరాత్రి పర్వదినం వేళ ముక్కంటి చెంత భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాధురి దంపతులు తమ ముద్దుల మనుమరాలు మైరాతో కలిసి ఆదివారం ఖమ్మం రూరల్ మండలం లోని తీర్థాల సంఘమేశ్వరుని ఆలయాన్ని సందర్శించారు. పసిప్రాయం లోనే భక్తిభావంతో స్వామివారిని దర్శించుకుంటున్న మైరా మురిపెంలో మంత్రి కుటుంబ సభ్యులు ఆధ్యాత్మికంలో మునిగితేలారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సాగిన ఈ పర్యటనలో మంత్రి దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించారు.

అనంతరం త్రివేణి సంగమ క్షేత్రంలో వెలసిన స్వామివారికి మిగతా 2లో

## నేడు మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**

2 వ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ ఎన్నికల కమిషన్ హైదరాబాద్ ఆదేశానుసారం. నేరేడుచర్ల పురపాలక సంఘం కార్యాలయ కౌన్సిల్ హాల్ నందు ఎన్నుకోబడిన సభ్యులు ప్రమాణ స్వీకారం ఉదయం 11.00 గంటలకు చైర్మేన్,వైస్ చైర్మన్ లకు పరోక్ష ఎన్నికల నిర్వహణ ఉన్నదని మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలియజేశారు.

## శివనామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి



8లో

### రాచకొండను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా

# అభివృద్ధి చేస్తా

### మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



2లో

## రాచకొండను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా
## మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**సంస్థాన్ నారాయణపురం. ఫిబ్రవరి 15. (జనంసాక్షి):**
సంస్థాన్ నారాయణపూర్ మండలం రాచకొండ గ్రామంలో రాచకొండ పర్యాటక ఉత్సవాలు, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో తన సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి గారితో కలిసి పాల్గొన్నారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు... చారిత్రక శివాలయంలో పంచామృతాలతో అభిషేకాలు జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు... రాచకొండ ప్రాంతం ఎన్నో దశాబ్దాల క్రితమే ఒక రాజ్యానికి రాజధాని కేంద్రంగా వెలసిల్లిందని ఈ ప్రాంతమంతా నాటి నుండే శైవ క్షేత్రాలతో ఆధ్యాత్మికతను సంతరించుకుందని గుర్తు చేశారు. శైవం విరాజిల్లిన ఈ ప్రాంతం లో నాటి చారిత్రక ఆధ్యాత్మిక శోభను మళ్లీ తిరిగి తీసుకురావడానికి నా సాయశక్తులా కృషి చేస్తానన్నారు. రాబోయే కాలంలో రాచకొండ ప్రాంతాన్ని చారిత్రక ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో శివ భక్తులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## శ్రమదానం కార్యక్రమం

వలిగొండ మండలం ఫిబ్రవరి 15 (జనం సాక్షి )
వలిగొండ మండలంలోని నా తల్లగూడెం గ్రామంలో శ్రమదాన కార్యక్రమం సర్పంచ్ మోటి జంగమ్మ లింగస్వామి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... గ్రామంలోని వీధులలో పరిశుభ్రత చేశామని మన చుట్టూ పక్క ల పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండడానికి ఎంతో దోహదపడతాయన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు బాలేశ్వర్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు,విజయ డైరీ చైర్మన్ పాండు, వీర మల్లయ్య, సైదులు, రాములు, శ్రీశైలం ,దానయ్య తదితరులు పాల్గొన్నారు.





## ప్రతి ఒక్కరూ శ్రీరామలింగేశ్వర స్వామి
# అనుగ్రహం పొందాలి

**బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ**
**మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**గుడిపల్లి,ఫిబ్రవరి 15(జనంసాక్షి )**
ప్రతి ఒక్కరూ శ్రీ శ్రీరామలింగేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం గుడిపల్లి మండల కేంద్రంలో శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఈసందర్భంగా దేవరకొండ మాజీ శాసనసభ్యులు మరియు నల్గొండ జిల్లా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ చింతనతో మానసిక ప్రశాంత లభిస్తుందని ఆయన అన్నారు.ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వల్లపు రెడ్డి,గ్రామ సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,రాజేందర్ రెడ్డి,మునగాల అంజి రెడ్డి,అర్వపల్లి నర్సింహ, తోటకూరి పరమేష్,ఎర్ర యాదగిరి,ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.





## పరమశివుని చెంత
## మంత్రి పొంగులేటి దంపతులు

అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

**రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి..**
దర్శనానంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. “మహాశివరాత్రి పర్వదినాన రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో విరాజిల్లాలని, తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆ పరమశివుడిని వేడుకున్నాను” అని తెలిపారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**తీర్థాల జాతరకు పోటెత్తిన భక్తజనం..**
తీర్థాల సంఘమేశ్వరుడి జాతరకు బుధవారం ఉదయం నుంచే భక్తులు తాకిడి అధికంగానే ఉంది. మంగళవారం రాత్రి నుంచి ఖమ్మం నగరంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు శివున్ని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. మహబూబాద్ జిల్లా డోర్నకల్, కురవి, బంగ్గా ప్రాంతాలతో పాటు ఖమ్మం నగరం, కూసుమంచి, చింతకాని, కొణిజర్ల మండలాల ప్రజలు శివున్ని దర్శించుకున్నారు. ఉదయం కొంత మందకొడిగా ఉన్న మధ్యాహ్నం 12గంటల నుంచి భక్తుల తాకిడి విపరీతంగా పెరిగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అలయంలో భక్తులు శివుడి దర్శనం వెంటనే ఆయ్యేందుకు తగు ఏర్పాట్లు చేశారు. భక్తులకు మున్నేరులో సరిపడా నీళ్లు ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు తలేత్తలేదు.

# గెలిచినా తగ్గని టెన్షన్
# ఓడినా వీడని అంతర్మథనం



**చండూరు, ఫిబ్రవరి 15 (జనంసాక్షి)**
ఇటీవల తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సందడి ముగిసి ఫలితాలు వెలువడటంతో, ఇప్పుడు రాజకీయ వర్గాల్లో లోతైన చర్చ మొదలైంది. ముఖ్యంగా చండూరు మున్సిపాలిటీలో ఫలితాల సరళిని చూసి గెలిచిన అభ్యర్థులు తమకు రావాల్సిన మెజార్టీ ఎందుకు రాలేదని, ఓడిన వారు అసలు ఎక్కడ తప్పటడుగు వేశామని లోతుగా విశ్లేషించుకుంటున్నారు.

**వ్యూహాలు తలకిందులు.. ఫలితాలపై లోతైన చర్చ**
చండూరులో ఈసారి ఎన్నికల చిత్రం భిన్నంగా కనిపించింది. అధికార కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకున్నప్పటికీ, ఆశించిన స్థాయిలో భారీ మెజార్టీ రాకపోవడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ నడుస్తోంది. అటు బీఆర్ఎస్, బీజేపీలు కొన్ని స్థానాలకే పరిమితం కావడంతో, ఆయా పార్టీల అధిష్టానాలు స్థానిక నాయకత్వంపై దృష్టి సారించాయి.

**వ్యతిరేక పవనాలు:**
గతంలో కౌన్సిలర్లుగా పనిచేసి మళ్లీ పోటీ చేసిన వారిపై స్థానిక ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఓట్లపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేకపోవడం అభ్యర్థులకు మైనస్‌గా మారింది.

**కొత్త ముఖాల తిప్పలు:**
కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన అభ్యర్థులకు ప్రజలతో సరైన పరిచయం లేకపోవడం, స్థానిక సమస్యలపై పట్టు లేకపోవడం ఓటమికి ప్రధాన కారణాలుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**మద్యం, మటన్, మనీ.. పనిచేయని తాయిలాలు**
ఈ ఎన్నికల్లో ప్రలోభాలకు కొదవ లేకుండా డబ్బు, మద్యం ఏరులై పారాయి. చాలా చోట్ల అభ్యర్థులు ఓటరుకు గాలం వేయడానికి భారీగా ఖర్చు చేసినా, ఫలితాలు మాత్రం వారికి అనుకూలంగా రాలేదు.డబ్బు పంచిన అందరూ ఓట్లు వేయలేదు.. డబ్బు అందని వారు పంతంతో వ్యతిరేకంగా వేశారు” అని ఓడిపోయిన అభ్యర్థులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. కేవలం 50% నుండి 80% మందికి మాత్రమే తాయిలాలు అందడం, పోల్ మేనేజ్‌మెంట్‌లో వైఫల్యం గెలుపు గుర్రాలను కూడా వెనక్కి లాగేలా చేశాయని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**ముందే కూసిన కోయిలలు.. క్యాంపు రాజకీయాల జోరు**
ఫలితాల రాకముందే తామే గెలుస్తామన్న ధీమాతో సంబరాలు చేసుకున్న అభ్యర్థులు, తీరా ఫలితాలు తలకిందులు కావడంతో మౌనమునులుగా మారిపోయారు. ‘ముందే కూసిన కోయిల’ చందంగా కొందరి పరిస్థితి తయారైంది.ప్రస్తుతం గెలిచిన అభ్యర్థులను కాపాడుకోవడానికి పార్టీలు ‘క్యాంపు రాజకీయాలు’ మొదలుపెట్టాయి.

**విప్ ఆదేశాలు:**
సోమవారం జరగనున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల దృష్ట్యా అభ్యర్థులు చేజారిపోకుండా పార్టీలు విప్ జారీ చేస్తున్నాయి.

**సేదతీరుతున్న అభ్యర్థులు:**
గెలిచిన అభ్యర్థులను రహస్య ప్రాంతాలకు (రిసార్ట్స్) తరలించారు. ఎన్నికల ప్రచారంలో అలసిపోయిన అభ్యర్థులు ఇప్పుడు క్యాంపులలో విశ్రాంతి తీసుకుంటూ చైర్మన్ పీఠం దక్కించుకునే వ్యూహాల్లో మునిగిపోయారు.చండూరు మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణలు నిమిష నిమిషానికి మారుతున్నాయి. పీఠం ఎవరిని వరిస్తుందో అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

### కోరిన కోర్కెలు తీర్చే

# భోళా శంకరుడు..

- శివ దర్శనానికి బారులుతీరిన భక్తులు
- తూర్పు ముఖమున గోదావరి నది ప్రవహించడం విశేషం
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు



**పినపాక, ఫిబ్రవరి 15(జనంసాక్షి):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పినపాక మండల వ్యాప్తంగా చింతల బయ్యారం, సీతంపేట, జానంపేట, దుగినేపల్లి,గొట్టెల్ల శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. హర హర మహాదేవ.. శంభోశంకర..ఓం నమ:శివాయ అంటూ శివనామస్మరణతో ఆలయాలు మారు మోగాయి. శివపార్వతులను పట్టు వస్త్రాలతో అలంకరించారు.ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ళు వేశారు. కళ్యాణ మండపాన్ని పచ్చిపూలతో అలంకరించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు తరలివచ్చి శివపార్వతులను దర్శించుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు నిష్టగా ఉపవాస దీక్షలు చేపట్టారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు శివపార్వతులను స్మరిస్తూ ఉపవాసం చేస్తారు.గోదావరి తీరాన స్నానమాచరించే భక్తుల కోసం మహిళలకు స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు.ఆధ్యాత్మికత ఉట్టిపడేలా శివార్చన జరిగింది. సాయంత్రం పలు రకాల పండ్లు సేవించి ఉపవాసాన్ని విడవను న్నారు. రాత్రంతా జాగారం చేస్తూ పరమశివున్ని స్మరించుకున్నారు.పవిత్ర గౌతమి గోదావరి తీరాన తూర్పు ముఖమున గోదావరి నది ప్రవహించడం విశేషం. ఉదయించే సూర్య కిరణాలు వెండి నాగుపడగల శివలింగాన్ని తాకుతూ ప్రసరిస్తాయి. ముఖ్యంగా చింతల బయ్యారం గ్రామంలో గోదావరి నది తీరాన పురాతన కాలంనాటి చారిత్రకమైన స్వయంభుగా వెలసిన శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు వేల సంఖ్యలో తిలకించారు. తెల్లవారి జామున 4 గంటల నుంచి ఆ పరమశివుని దర్శించుకునేందుకు శివాలయంలో భక్తులు క్యూ లైన్లుకట్టారు. శంభో శంకర అంటూ మహా శివుడిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా చింతల బయ్యారం శివపార్వతుల సన్నిధిలో భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించించి.

## చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలి

**కోదాడ మాదిగ యువకుడు కర్ల రాజేష్ మాదిగ లాకప్ డెత్ ప్రధాన నిందితుడు చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలి**

**- కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేదాకా పోరాటం కొనసాగిస్తాం**

**- ఈ నెల 28 న ప్రజా అగ్రహా మహాసభ ఛలో సూర్యాపేట ను జయప్రదం చేయండి :నల్ల చంద్రస్వామి మాదిగ**



**చింతలపాలెం(జనంసాక్షి)**
సూర్యాపేట జిల్లా,హుజర్ నగర్ నియోజకవర్గం,చింతలపాలెం మండల కేంద్రంలో ఎమ్మార్పియస్,ఎంఎస్పీ ముఖ్యకార్యకర్తల సమావేశం ఎమ్మార్పియస్ మండల అధ్యక్షులు గొల్లపూడి రాకేష్ మాదిగ అధ్యక్షతన కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం జరగాలని కర్ల రాజేష్ లాకప్ డెత్ కు కారణమైన పోలీసులపై అధికారులపై చర్య తీసుకోని డిమాండ్ తో జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చింతలపాలెం మండల ఇంచార్జీ ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ హాజరై మాట్లాడుతూ కోదాడలో జరిగిన కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనపై ఎమ్మార్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నేత్రుత్వంలో సుమారు 90 రోజులుగా న్యాయపోరాటం కొనసాగుతున్నా ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి చాలా బాధాకరమని, పోలీసులు ఏ తప్పు చేయకపోతే కర్ల రాజేష్ రిపోస్ట్ మార్టం ఎందుకు చేయించడం లేదు,రాజేష్ ని చిత్రహింసలు పెట్టి లాకప్ డెత్ చేసింది చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి,పోస్టుమార్టం చేసింది లక్ష్మి కాంత్ రెడ్డి,ఫోటోగ్రఫీ చేసింది రామకృష్ణారెడ్డి,ఇలా తప్పుల మీద తప్పులు చేస్తూ దళిత యువకుడ్ని పొట్టన పెట్టుకున్నారు.భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటన జరగకుండా పోలీసులపైన మరియు అధికారులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేకుంటే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.కర్ల రాజేష్ లాకప్ డెత్ లో అనేక సాక్షాధారాలు ఉన్న నిందితుడైన ఎస్ఐ సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయకుండా కాపాడుతున్నారని బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.కర్ల రాజేష్ మాదిగ కుటుంబానికి న్యాయం చేసేదాకా పోరాటం కొనసాగిస్తా మని అందులో భాగంగా ఎమ్మార్పియస్ అధినేత మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 28 న ప్రజా ఆగ్రహా మహాసభ జరుగబోతుందని,ఈ సభకు ప్రతి గ్రామం నుండి పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా ఎమ్మార్పియస్ అధ్యక్షులు కూరపాటి సునీల్ మాదిగ,ఎమ్మార్పియస్, ఎమ్మెస్పీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింత్రియాల బాలచంద్రుడు మాదిగ,ఎంఎస్పీ ఖమ్మం రాష్ట్ర నాయకులు గిలకత్తుల ఇద్ద య్య మాదిగ,సీనియర్ నాయకులు చిలక యేసు మాదిగ,ఆరోను మాదిగ,పట్టణ అధ్యక్షుడు గోపి మాదిగ,రాకేష్,ఇద్దయ్య మాదిగ,శ్రీను మాదిగ తదితరులు

## చదువుల తల్లి కి ఆసరాగా నిలిచిన ఎన్నారై కుంభం శ్రీనివాస్ రెడ్డి

### ఎంబిబిఎస్ విద్యార్థికి 50 వేల ఆర్థిక సహాయం..



మర్రిగూడ, ఫిబ్రవరి 15 (జనం సాక్షి)
చదువుల తల్లి కి ఆసరాగా నిలిచిన ఎన్నారై కుంభం శ్రీనివాస్ రెడ్డి...మర్రిగూడ మండలం మేటి చందాపూర్ గ్రామానికి చెందిన లపంగి శ్రీను?పార్వతమ్మ దంపతుల కూతురు శివానికి కామారెడ్డి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు లభించింది. పేదరికం కారణంగా చదువు కొనసాగించలేని పరిస్థితిలో ఉన్న విషయం నామాపురం మాజీ ఎంపిటిసి ఊరిపక్క సరిత నగేష్ ఎన్నారై కుంభం శ్రీనివాస్ రెడ్డికి వివరించారు.సేవ భావంతో ఎన్ఆర్ఐ కుంభం శ్రీనివాస్ రెడ్డి ముందుకు వచ్చి శివానికి 50,000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయంతో శివాని చదువు కొనసాగించడానికి సహకరించిన శ్రీనివాస్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరి యాదయ్య (ఆరోగ్య శ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు), గుల్లి నర్సింహా (వార్డ్ మెంబర్), లపంగి భిక్షం, జోగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులకు నేటి నుండి ఐదు రోజుల శిక్షణ

### రెండు బ్యాచ్‌లుగా విభజన ఎంపీడీవో వంశీధర్



**మాడ్గులపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 15 జనంసాక్షి :** మండలంలోని గ్రామ పంచాయతీలకు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు వారి విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు జనరల్ ఓరియంటేషన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాడ్గులపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వంశీధర్ ఒక ప్రకటనలో తెలిపారు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని రెండు విడతలుగా (బ్యాచ్‌ల వారీగా) ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వేదిక మాడ్గులపల్లిలోని ఎం ఆర్ సి భవనం లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమయం ప్రతిరోజూ ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ షెడ్యూల్మొదటి బ్యాచ్ తేదీ 16.02.2026 నుండి 20.02.2026 వరకు ఈ క్రింది గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు మొదటి విడతలో హాజరుకావాలి. ఆగా మోత్కూర్, భీమనపల్లి, బొమ్మకల్, చిరుమర్తి, గంద్రవానిగూడెం, గుర్రప్పగూడెం, ఇసుకవాయిగూడెం, కల్లలపాలెం, కుక్కడం, పోరెడ్డి గూడెం, పాములపాడు, సీతయ్య తండా, మరియు తోపుచర్ల రెండో బ్యాచ్ తేదీ 23.02.2026 నుండి 27.02.2026 వరకుఈ క్రింది గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు రెండో విడతలో హాజరుకావాలి.అభంగాపురం, ధర్మాపురం, కేశవపురం, గజలపురం, గారకొంట పాలెం, గోపాలపురం, కనేకల్, మాచనపల్లి, నారాయణపురం, పూసలపాడు, దాచారం, చెరువుపల్లి, కొత్తగూడెం, మాడ్గులపల్లి గ్రామాలు సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణకు హాజరయ్యే వార్డు సభ్యులకు నిష్ణాతులైన రిసోర్స్ పర్సన్స్ టూ టీ ద్వారా పంచాయతీ రాజ్ చట్టం, నిధుల వినియోగం, గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఉంటుందని ఎంపీడీవో వంశీధర్ తెలిపారు. వార్డు సభ్యులందరూ తప్పనిసరిగా హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు శిక్షణకు వచ్చే సభ్యులకు భోజన వసతి కల్పించబడుతుందని ఆయన స్పష్టం చేశారు.

## ముత్యాలమ్మ గుడి స్థలం ఆక్రమణపై దళితులు ఆగ్రహం

### కాంగ్రెస్ వార్డు మెంబర్ తీరుపై మాల, మాదిగ కుల సంఘాల నిరసన

### పోలీస్, రెవెన్యూ శాఖలకు ఫిర్యాదు చేస్తామని వెల్లడి





**మాడ్గులపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 15 జనంసాక్షి:**
నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గజలాపురం గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసు కుంది దళితులకు చెందిన ముత్యాలమ్మ గుడి స్థలాన్ని ఆక్రమించడాన్ని నిరసిస్తూ మాల, మాదిగ కుల సంఘాల నాయకులు స్థానిక దళితులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు.వివరాల్లోకి వెళ్తేగజలాపురం గ్రామంలో దళిత మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పూర్వకాలం నుండి ముత్యాలమ్మ గుడిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ ఆ స్థలాన్ని అనుభవిస్తున్నారు అయితే ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ 2వ వార్డు మెంబర్ సింగం కార్తీక్ తన సొంత ఇంటికి సీసీ రోడ్డు వేసుకోవాలనే ఉద్దేశంతో గుడికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి అక్కడ మట్టి పోయడం వివాదానికి దారితీసింది కుల సంఘాల ఆగ్రహం తమ ఆరాధ్య దైవమైన ముత్యాలమ్మ గుడి స్థలాన్ని రాజకీయ పలుకుబడితో ఆక్రమించడంపై దళిత సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడ్డారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా దళితుల ఆధీనంలో ఉన్న ఆధ్యాత్మిక స్థలాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆక్రమించడం అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే మట్టిని తొలగించి గుడి స్థలాన్ని యథావిధిగా ఉంచాలని డిమాండ్ చేశారు.

**ఫిర్యాదుకు సిద్ధం**

ఈ అక్రమ ఆక్రమణపై ఊరుకునే ప్రసక్తి లేదని, త్వరలోనే పోలీస్ రెవెన్యూ శాఖ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని దళిత నాయకులు స్పష్టం చేశారు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి జానయ్య, కుక్కమూడి శ్రీను, కుక్కాముడి కోటేశ్, వెంకటయ్య, మనిమద్ధి కృష్ణయ్య, కుక్కముది ప్రభాకర్, రమేష్, జక్క నాగరాజు, మాల,మాదిగ కుల సంఘాల ప్రతినిధులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



**సూర్యాపేట(జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని విద్యా నగర్ లో గల శ్రీరామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో ఆదివారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పరమ శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి లింగోద్భవ కాలం నందు మహా అభిషేకం, అర్ధరాత్రి శివపార్వతుల కళ్యాణంను వైభవంగా జరిపించనున్నారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ అనంతుల గణేష్ మాట్లాడుతూ మూడు రోజులపాటు మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నేడు రుద్ర హోమం, కలశ ఉద్వాసన, బలిహరణ, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తెల్లవారుజాము నుండి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. దేవాలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ, విశేషమైన అభిషేకాలు, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు అనంతుల సందీప్, అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్, పెద్దిరెడ్డి భరత్, సిహెచ్. వెంకటేశ్వర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### శివనామ స్మరణతో మారుమ్రోగిన

# పిల్లలమర్రి శివాలయాలు



**సూర్యాపేట(జనంసాక్షి):**
సూర్యాపేట జిల్లాలో ప్రసిద్ధి చెందిన చారిత్రక దేవాలయాలైన పిల్లలమర్రి శివాలయాలకు ఆదివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే పరమశివుని దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఎరకేశ్వర స్వామి, మహాదేవ నామేశ్వర స్వామి, త్రికుటేశ్వర స్వామివారి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ కొండ వెంకన్న గౌడ్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మహా శివరాత్రి పర్వదినాన శివపార్వతుల కళ్యాణం ను వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్ల తో పాటు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో దేవాలయ డైరెక్టర్లు చిలుక ఆనంద్, చెరుకుపల్లి కృష్ణ, చెరుకుపల్లి బుచ్చిరాములు, చిత్తలూరి పూజిత, ఓబల్లోజు తేజస్విని, వల్లాల జానీ, రాయల సైదులు, సురేష్, జానీమియా, దేవాలయ ప్రధాన అర్చకులు మునగలేటి సంతోష్ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## కనుల పండుగగా రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**వలిగొండ మండలం ఫిబ్రవరి 15 (జనంసాక్షి)**
వలిగొండ మండలంలోని వెంకటాపురం గ్రామంలోని మత్స్యగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ,శ్రీ పార్వతీ సమేత పంచముఖరామలింగేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో ఉ.11.30ని.లకు శ్రీ పార్వతీ సమేత పంచ ముఖ రామ లింగేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవం అర్చకులు, వేదపండితులచే అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించడమైనది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్ బాబు శ్రీస్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కన్నుల పండుగగా సాగిన కళ్యాణాన్ని వీక్షించుటకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడమైనదని కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం గ్రామ సర్పంచ్ కర్నేకంటి కళమ్మ-యాదయ్య, ముద్దపురం గ్రామ సర్పంచ్ సామ సరస్వతి రాంరెడ్డి ,దేవస్థానం మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డి, మాజీ ధర్మకర్తలు , గ్రామ పెద్దలు అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## పచ్చల సోమేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల ప్రత్యేక పూజలు

**కనగల్లు, ఫిబ్రవరి 15 (జనంసాక్షి)**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పానగల్లు డివిజన్లోని పచ్చల, ఛాయా సోమేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో శేష వస్త్రా లతోపాట, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. అనంతరం తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామంలో శంభు లింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి గ్రామ ప్రజలతో పూజలు చేసి ఆలయ అభివృద్ధి కోసం 3 లక్షల 116 రూపాయలు విరాళంగా ప్రకటించారు. ఆయన వెంట మామిడాల గ్రామ సర్పంచ్ కొత్తపల్లి సైదులు, నల్లగొండ రెండవ డివిజన్ కార్పొరేటర్ పెరిక యాదయ్య, టౌన్ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాసరెడ్డి, కందుల లక్ష్మయ్య, సూర మహేష్, భాష పాక హరికృష్ణ, ప్రదీప్ యాదవ్, రాపోలు వెంకటేశ్వర్లు, కొండ స్వరూప, యాదగిరి రెడ్డి, కృష్ణ, సైదులు, నవీన్, తిరుపతయ్య తదితరులు ఈ న్నారు .



# చండూరు మున్సిపాలిటీపై మళ్లీ హస్తం జెండా

### మున్సిపల్ చైర్మన్‌గా కోడి శ్రీనివాసులు ఖరారు




**చండూరు, ఫిబ్రవరి 15 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లా రాజకీయాల్లో కీలకమైన చండూరు మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. వరుసగా రెండోసారి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ మొత్తం 10 వార్డులకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ దిశగా సాగి మెజారిటీకి కావాల్సిన స్థానాలను సునాయాసంగా దక్కించుకుంది.

కాంగ్రెస్: 06 స్థానాలు
బీఆర్ఎస్: 03 స్థానాలు
సీపీఐ: 01 స్థానం

మెజారిటీ మార్కు (6) సాధించడంతో చండూరు మున్సిపాలిటీలో మరోసారి కాంగ్రెస్ పాలన ఖాయమైంది. ఈ విజయం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. చైర్మన్ పీఠంపై 'కోడి శ్రీనివాసులు'.. లైన్ క్లియర్!
మున్సిపల్ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందనే ఉత్కంఠకు తెరపడినట్లు తెలుస్తోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన కోడి శ్రీనివాసులును చైర్మన్ పదవికి ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే పార్టీ అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించిందని, గెలిచిన కౌన్సిలర్లకు కూడా దీనిపై స్పష్టమైన సమాచారం అందినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. మరోవైపు, వైస్ చైర్మన్ పదవి కోసం బుషిపాక వాసు, భూతరాజు దశరథ మధ్య గట్టి పోటీ నెలకొంది. వీరిలో ఎవరికి అవకాశం దక్కుతుందనేది పార్టీ అంతర్గత చర్చల అనంతరం తేలనుంది. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి పంచిన డబ్బు, మద్యం మరియు ఇతర తాయిలాల లెక్కలపై అభ్యర్థులు తలమునకలయ్యారు. కొన్ని చోట్ల గెలుపు ఓటములపై లక్షలాది రూపాయల బెట్టింగ్‌లు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. పలువురు అభ్యర్థులు అప్పులు చేసి మరీ ఖర్చు చేయడంతో, ఫలితాల అనంతరం వారి భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు.

## యువకులు నడుం బిగించారు – రోడ్డు బాగు చేసుకున్నారు





**టేకులపల్లి,ఫిబ్రవరి 15(జనంసాక్షి):**
పాలకులకు చెప్పి చెప్పి విసుగు చెందిన యువకులు చేయి చేయి కలిపి నడుం బిగించి వారి గ్రామంలోని రోడ్డును వారే బాగు చేసుకున్నారు. టేకులపల్లి మండలం లోని కొప్పురాయ్ గ్రామ పంచాయతీలో లక్ష్మీపురం గ్రామంలో రోడ్డు అధ్వానంగా ఉండడంతో పలుమార్లు పాలకులకు చెప్పినప్పటికీ పట్టించుకోక పోవడంతో ఆ గ్రామంలోని ఆ గ్రామంలోని యువకులంతా సమావేశమై కొంత ఆర్థిక భారాన్ని వారే మోస్తూ జెసిబి, ట్రాక్టర్లను తెప్పించుకొని రోడ్డును బాగు చేసుకున్నారు. రోడ్డు బాగవడంతో గ్రామస్తులంతా ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని యువకులంతా పట్టుదలతో గ్రామాభివృద్ధికి తోడ్పడటం పట్ల పలువురు వారిని అభినందిస్తున్నారు.

# వైభవంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం

## మహా అన్నదాన కార్యక్రమం..









**బూర్గంపహాడ్ ఫిబ్రవరి 15 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయములో స్థానిక మండల విశ్వబ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో బుధవారం శ్రీ శ్రీ శ్రీ గోవింద మాంబా సమేత పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణం ప్రతి ఏటా మాదిరిగా ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారి దర్శనార్థం బారులు తీరారు. సామూహిక అభిషేకాల అనంతరం అశేష భక్త జనుల నడుమ స్వామివారికి మధ్యాహ్నం 12:30 గంటలకు అభిజిత్ లగ్నంలో యలబాక నరసింహా చారి ఝాన్సి దంపతులచే పురోహితులు స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. మండలంలోని భక్తుల సహాయ సహకారాలతో, విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో శ్రీ గోవింద మాంబా సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తి శ్రద్ధలతో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పట్టణ పురవీధులలో మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయ ధర్మకర్త కనసాని కృష్ణమాచారి మాట్లాడుతూ భూత, భవిష్యత్, వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన కలియుగ దైవము వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆశీస్సులు అందరికి ఉండాలని, అందరికీ స్వామివారి కృపా కటాక్షాలు కలగాలని కోరుకుంటు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సారపక సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, మాజీ ఎంపీపీ కైపు రోసి రెడ్డి, మాజీ సర్పంచ్ జక్కం సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ జక్కం బలరాం, బొల్లు సాంబ, కాకర్ల ప్రతాప్, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, డాక్టర్ లక్కోజు విష్ణు వర్ధన్, పాత్రికేయులు కందుకూరి శ్రీనివాసాచారి, లాయర్ రామచంద్రయ్య, డాక్టర్ కడార్ల కృష్ణ, కదార్ల శ్రీనివాస్, బెజ్జంకి కనకాచారి, గోకవరపు లక్ష్మీనారాయణ, కనసాని మాధవాచార్యులు, ఆలయ అర్చకులు కనసాని కోటేశ్వర చారి, కొడపాక సత్యనారాయణ, పోతోజు కొండయ్య, మహిసాక్షి వీర బ్రహ్మాచారి, బొద్దోజు ఉమామహేశ్వరరావు, గ్రామ విశ్వబ్రాహ్మలు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ గోగుల యాదమ్మ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు

## పురాతన ఆలయ అభివృద్ధికి సర్కార్ చేయూతనందించాలని గ్రామస్తుల విన్నపం

**గుర్రంపోడు ఫిబ్రవరి 15 (జనంసాక్షి)**
గుర్రంపోడ్ మండలం బ్రాహ్మణ గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లిపహాడ్ గుట్టపై వెలిసిన శ్రీ స్వయంభూ పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తజన సంద్రమైంది. ప్రకృతి ఒడిలో, ప్రశాంతమైన వాతావరణంలో వెలిసిన ఈ ఆలయంలో ఆదివారం నాడు వేడుకలు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి.సర్పంచ్ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామ సర్పంచ్ గోగుల యాదమ్మ - లింగయ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గుట్టపైకి వెళ్లే భక్తుల కోసం మంచినీరు, చలువ పందిళ్లు, మరియు లైటింగ్ సౌకర్యాలను కల్పించారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శివనామ స్మరణతో పల్లిపహాడ్ గుట్ట మారుమోగింది. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



# వార్డుల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి

## ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్

**చౌటుప్పల్, ఫిబ్రవరి 15 (జనంసాక్షి):** ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వార్డుల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల గెలుపొందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీల కౌన్సిలర్లు ఆదివారం ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ ను కలిశారు. పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ కౌన్సిలర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. మున్సిపాలిటీలో విద్య, వైద్యం , ఉపాధి, మౌలిక వసతుల కల్పనలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు నిత్యం ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.



# ఘనంగా శివరాత్రి మహోత్సవాలు

**జనంసాక్షి /పెద్దవూర**

నల్గొండ జిల్లా పెద్దవూర మండలం బట్టుగూడెం,చింతపల్లి, తెప్పలమడుగు, తుంగతుర్తి గ్రామాలలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాలలో గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బట్టు గూడెం ఇష్టకామేశ్వర స్వామి దేవాలయంలో మాజీ జెడ్పి వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇక్కడికి వచ్చే భక్తులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసిన ఆలయ కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు పబ్బు యాదగిరి గౌడ్, పెద్దవూర సర్పంచ్ వెంకటయ్య గౌడ్, పట్టుగూడం మాజీ ఎంపిటిసి ముత్యాల్ రెడ్డి, కోన్ రెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం యువకుడి స్వల్పచిత్రం 'లూనా'కు ప్రతిష్ఠాత్మక పురస్కారం

- న్యూఢిల్లీ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ఖమ్మం యువకుడి
- గోగినేని ఆకాష్ తీసిన విజ్ఞాన సాంకేతిక నేపథ్య స్వల్పచిత్రం 'లూనా'కు ప్రతిష్ఠాత్మక పురస్కారం
- సృజనాత్మకమైన విషయాలా పై ప్రత్యేక ఆసక్తి కనబరిచేవాడు తల్లిదండ్రులు : గోగినేని కిరణ్ కుమార్, హిమబిందు

**ఖమ్మం, ఫిబ్రవరి 15 (జనంసాక్షి):**
దేశ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ మండపం వేదికగా వైభవంగా నిర్వహించిన న్యూఢిల్లీ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం లో ఖమ్మం నగరానికి చెందిన యువ దర్శకుడు గోగినేని ఆకాష్ రూపొందించిన విజ్ఞాన సాంకేతిక నేపథ్య స్వల్పచిత్రం 'లూనా' ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకుంది. దేశవ్యాప్తంగా ఎంపికైన పలు చిత్రాల మధ్య 'లూనా' ప్రత్యేక గుర్తింపు సాధిం చడం గర్వకారణంగా నిలిచింది. ఇప్పటికే ఈ చిత్రం జైపూర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ చలన చిత్రోత్సవానికి అధికారికంగా ఎంపికై ప్రశంసలు అందుకుంది. తాజా విజయంతో దర్శకుడు ఆకాష్ సినీ ప్రయాణంలో మరో కీలక మైలురాయి చేరుకున్నాడు. తన సృజనాత్మక దృష్టి, సాంకేతిక నైపుణ్యంతో రూపొందించిన 'లూనా' ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ పురస్కారాన్ని హను రోజ్ చేతుల మీదుగా ప్రదానం చేయడం విశేషం. ప్రస్తుతం అమెరికా లో ఉన్న ఆకాష్ తరపున ఆయన తల్లిదండ్రులు గోగినేని కిరణ్ కుమార్, హిమబిందు ఫిబ్రవరి 13న జరిగిన రెడ్ కార్పెట్ కార్యక్రమంలో పాల్గొని, 14వ తేదీన పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గోగినేని కిరణ్ కుమార్, హిమబిందు మాట్లాడుతూ, "మా కుమారుడు చిన్నప్పటి నుంచే సృజనాత్మకమైన విషయాలా పై ప్రత్యేక ఆసక్తి కనబరిచేవాడు అని . ఎన్నో సవాళ్లు ఎదురైనా తన లక్ష్యాన్ని వదలకుండా కృషి చేశాడు. దేశ రాజధానిలో పుంస్కారం అందుకోవడం మా కుటుం బానికి గర్వ కారణం. ఖమ్మం పేరు జాతీయ స్థాయిలో వినిపించడం ఎంతో ఆనందంగా ఉంది. భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరా లను అధిరోహించాలని ఆశిస్తున్నాం" అని తెలిపారు. ఖమ్మం యువ దర్శకుడి ఈ విజయంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'లూనా' చిత్రం యువతకు స్ఫూర్తినిస్తూ ఖమ్మం ప్రతిష్ఠను దేశవ్యాప్తంగా చాటింది.





### కల్లూరు మండలంలోశివనామస్మరణతో

# మారు మోగిన శైవ క్షేత్రాలు

## కాశ్మీర్ మహాదేవ క్షేత్రం తిరునాళ్ల జాతరకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు

## పదివేల మంది భక్తులకు మహా అన్నదానం















**కల్లూరు ఫిబ్రవరి 15 (జనంసాక్షి):**
కల్లూరు మండలం లోని పలు శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరునాళ్ల జాతర వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి కల్లూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తిరునాళ్ల జాతరకు తరలివచ్చిన వేలాదిమంది భక్తుల శివ నామస్మరణతో శైవ క్షేత్రాలు మారుమోగాయి. మండల పరిధిలోని పుల్లయ్య బంజారా సమీపానగల శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రం, తిరువూరు ఎన్ఎస్పి క్రాస్ రోడ్ సమీపానగల శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయం, చెన్నూర్ పెద్దారం గ్రామ సమీపాన సాగర కాలవ ప్రాంతంలో కొలువైన గంగమ్మ తల్లి ఆలయం, చిన్న కోరుకొండి లోని శ్రీ భ్రమరామ సమేత మల్లికార్జున స్వామి ఆలయం, కల్లూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో నూతన బస్టాండ్ సమీపాన అత్యంత మహిమ కలిగిన శ్రీ కనకగిరి శివాలయం, కల్లూరు పెద్ద చెరువు కట్టమీద గల శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు తిరునాళ్ల జాతర అత్యంత భక్తిపార్వశంతో అంగరంగ వైభవంగా కొనసాగాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు శివాలయాలకు చేరుకొని పరమశివుని దర్శించుకొని పంచామృతాలతో వేద పండితుల ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. తీర్థ ప్రసాదములు స్వీకరించి అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నారు. కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రంలో దాతల సహకారంతో సుమారు పదివేల మంది భక్తులకు ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కాశ్మీర మహాదేవ క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరునాళ్ల జాతర కు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ ఆదేశాల మేరకు రూరల్ సీఎం ముత్తు లింగయ్య స్థానిక ఎస్సై డి హరిత, ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా విద్యుత్ శాఖ ఏఈ మహేంద్ర బాబు ఆధ్వర్యంలో సిబ్బంది విధులు నిర్వహించారు ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో ఎస్విడి ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో మౌలిక సదుపాయాలు కల్పించారు. వేద పండితుల ఆధ్వర్యంలో రాత్రి 10 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిపించారు. మిఠాయి దుకాణాలు జాయింట్ వీల్స్, రంగులరాట్నం, కోలాటం నృత్యాలు, బండ్లపై ప్రభలతో, బొమ్మల దుకాణాలు, మిఠాయి దుకాణాలతో ఆలయాల ప్రాంగణాలు ఆహ్లాదకరమైన వాతావరణంతో ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్ర శివనామ స్మరణతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ ఎస్ వి డి ప్రసాద్, అర్చకులు సురేష్ శర్మ, భక్తులు బందెల రాధాకృష్ణ,, బుర్రి వీరయ్య, రాచబంటి శ్రీను, జాబిశెట్టి శ్రీనివాసరావు, బొల్లం రామారావు, నోటి కృష్ణారెడ్డి బొల్లం శంకర్ గౌడ్, రాధా దంపతులు,ఆలయ ఉత్సవ కమిటీ, తిరునాళ్ల జాతర భక్త బృందం, పుర ప్రముఖులు, వివిధ పార్టీల రాజకీయ ప్రముఖులు ప్రజాప్రతినిధులు తదితరులు తిరునాళ్ల జాతర ప్రత్యేక అభిషేక, పూజా కార్యక్రమాలలో పాల్గొని పరమశివుని దర్శించుకొని ప్రత్యేక తీర్థప్రసాదములు స్వీకరించారు.



కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం మహా శివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శివ లింగానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు పాల గణపతి శర్మ, పాల సదాశివశర్మ, దేరం జయప్రకాష్ శర్మ, ఘంటసాల శివప్రసాద్ శర్మ, నీల లక్ష్మయ్య, లక్ష్మణ్, ఊరే నరేష్, ఏరుకొండ రాము, నీలా విజయ్, చిలువేరు నారమ్మ, చిలువేరు వైశాలి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**కొండమల్లేపల్లి, జనంసాక్షి.**

# పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించిన బిషప్ సగిలి ప్రకాష్

## 795 మంది విద్యార్థులకు చెక్కుల పంపిణీ



**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 15 (జనంసాక్షి):**
ఖమ్మం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు స్కాలర్షిప్ లు ఖమ్మం మెత్రాసన సేవా సంస్థ తరపున బిషప్ సగిలి ప్రకాష్ అందజేశారు. ఖమ్మం డయోసిస్ , ఖమ్మం డయో సిస్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బాల జ్యోతి రెమెడీల్ స్కూల్ . ఖమ్మం రూరల్ మండలం నందు బిషప్ శ్రీశ్రీ సగిలి ప్రకాష్ ఆదివారం 795 మంది ఉన్నత స్థాయి విద్యనభ్యసిస్తున్న ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం ఉమ్మడి జిల్లా విద్యార్థులకు స్కాలర్షిప్ లు అందజేసారు. ముఖ్యముగా ఎం బి బి ఎస్, బి ఫార్మసీ ,ఎం ,ఫార్మసీ , పాం డీ ,బిఈడి,ఇంజనీరింగ్, ఎంబీఏ, బీఎస్సీ నర్సింగ్, బిఎస్సి అగ్రికల్చరల్, పీజీ డిగ్రీ,, డి ఎం ఎల్ టి, ఎల్ ఎల్ బి , ఖచ్చిత మరియు స్పెషల్ ఓరియంటల్ కోర్సు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఈ స్కాలర్షిప్ప అందజేసారు. ఈ సందర్భంగా మాట్లాడిన బిషప్ సగిలి ప్రకాష్ గారు విద్యార్థులు మంచి క్రమశిక్షణతో ఉన్నత విలువలను నేర్చుకొని సమాజంలో మంచి పౌరులుగా ఎదిగి దేశ, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు, మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటుగా ఖమ్మం డయోసిస్ సేవా సంస్థ విద్య , వైద్య, సంక్షేమ రంగాలలో విశేషంగా సేవలు అందిస్తూ ఉందని అందులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలియజేస్తూ, మంచిగా చదువుకొని తాము కూడా మరికొంతమందికి చేయూత నేచ్చేలా విలువలు నేర్చుకోవాలని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి భాధ్యతతో చదువుకోవాలని పిలుపు నిచ్చారు . ఉదయం 10గంటలకు ప్రార్థన చేసి విద్యార్థులను దీవించారు. తదనం తరం చెక్కులను పంపిణీ చేసారు. విద్యార్థులందరు ఖమ్మం మెత్రాసన సేవా కార్యక్రమాలను అభినందిస్తూ కృతజ్ఞతగా బిషప్ గారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వికార్ జనరల్ తప్పుటి, శౌరి ,ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ .సూరేపల్లి ఐజాక్, బిషప్ సెక్రెటరీ ఫాదర్ తుదుం. విజయ్, సోషల్ సర్వీస్ డైరెక్టర్, ఫాదర్ దామల్ల .సురేష్. బోర్డింగ్ రెక్టర్ ఫాదర్ ఆరోగ్యం. ఫాదర్ శ్రీకాంత్, పాస్టర్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ కాకుమాను రాజు, ఫాదర్ సంపత్ మరియు నాయుడుపేట లోగల కమ్యూనిటీ సిస్టర్లు సంఘ పెద్దలు ముత్తమాల. ప్రసాద్ ,సాల్మన్ జయరాజు, పిల్లి .ప్రసాద్. జయరాజు , మాటపోతుల బాబు రావు, రాజు ,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అనాధకు ఆఖరి తోడుగా అన్నం ఫౌండేషన్

## రైలు ప్రమాదాల్లో మృతి చెందిన ఇద్దరికీ అంత్యక్రియలు




**ఖమ్మం, (జనంసాక్షి):**
డోర్నకల్ జీఆర్పీ పోలీస్ పరిధిలో పాపటపల్లి సమీపంలో గుర్తుతెలియని సుమారు 60 ఏళ్ల లోపు వయస్సు గల ఓ మగ వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరిచారు. ఎవరూ గుర్తించకపోవడంతో అనాధ శవంగా భావించి అంత్యక్రియల నిర్వహణ కోసం అన్నం ఫౌండేషన్ కు సమాచారం ఇచ్చారు. మరో ఘటనలో ఖమ్మం జీఆర్పీ పరిధిలో బోనకల్?నాగులవంచ రైల్వే లైన్ మధ్యలో చత్తీస్గఢ్ రాష్ట్రం పల్లరి జిల్లాకు చెందిన లోకేశ్వర్ సాహు రైలు ప్రయాణంలో జారిపడి మృతి చెందాడు. మృతుడి సెల్ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులను పోలీసులు పిలిపించగా, వారు ఖమ్మం చేరుకొని మృతదేహాన్ని గుర్తించారు. అయితే మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో దహన సంస్కారం చేయమని అన్నం ఫౌండేషన్ను కోరారు. ఈ రెండు ఘటనల నేపథ్యంలో రైల్వే పోలీస్ అధికారులు, వైద్యశాల సిబ్బంది సమక్షంలో అన్నం ఫౌండేషన్ మృతదేహాలను మార్చురీ నుంచి స్వాధీనం చేసుకొని తెల్ల వస్త్రాలలో చుట్టి పూలతో సత్కరించి నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామానికి తరలించింది. అనంతరం మృతుల కుటుంబ సభ్యుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా, గౌరవప్రదంగా దహన సంస్కారాలు నిర్వహించింది. ఈ సేవా కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన మోతే వీరభద్రుని ఆలయం

## గోదావరి నదీ తీరంలో పోటెత్తిన భక్తజనం



**బూర్గంపహాడ్ ఫిబ్రవరి 15 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఘనచరిత్ర కలిగిన 600 ఏళ్ల పురాతన ఆలయం మోతే శ్రీభద్రకాళి సమేత వీరభద్రుని ఆలయంతో పాటు మండలవ్యాప్తంగా బూర్గంపహాడ్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, మోరంపల్లి బంజర గ్రామాల్లో శైవక్షేత్రాలు ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన భక్తులతో కిటకిటలాడాయి. శివరాత్రి సందర్భంగా ఆలయాల పరిసర ప్రాంతమైన గోదావరి తీరం భక్తజనంతో జాతరను తలపించింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని మోతే వీరభద్రుని ఆలయానికి మండల పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి తరలివస్తుండటంతో గోదావరి నదీతీరం జనంతో నిండిపోయింది. అయితే భక్తుల సౌకర్యార్థం ఆలయకమిటీ నిర్వాహకులు నాటు పడవలు ఏర్పాటుచేసి నది అవతలి ఒడ్డుకు భక్తులను తరలించారు. నాటుపడవల ద్వారా భక్తులను తరలించినప్పటికీ వారి భద్రత దృష్ట్యా ఎలాంటి సేఫ్టీ జాకెట్లు ఇవ్వకపోవడంతో కొందరు భక్తులు నిర్వాహకుల తీరుపై మండిపడ్డారు. ఆ తర్వాత భక్తులు గోదావరి నదీతీరంలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీభద్రకాళి సమేత



వీరభద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆ ఆలయానికి వెళ్లాలంటే గోదావరి తీరంలో ఇసుకలో కొంతదూరం నడిచివెళ్లి అక్కడ బోటు సహాయంతో అవతలి వైపు ఉన్న ఆలయం వద్దకు చేరుకోవాల్సి ఉండటంతో అలా భక్తులు ఇసుకలో నడిచివెళ్లి మరీ స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో ఆంధ్రా చింతలగూడెం, చెన్నంపేట నుంచి మరో దారిలో భక్తులు నడిచి వచ్చి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ ఆలయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేషఅర్చన, మహారుద్రాభిషేకం, మహాబిల్వార్చన, రాత్రి 10.30 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు శ్రీభద్రకాళి సమేత వీరభద్ర స్వామికి కల్యాణాన్ని కల్యాణమండపంలో అర్చకులు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. అయితే ఆలయానికి వచ్చిపోయే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయకమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయగా ఎస్సైలు మేడా ప్రసాద్, నాగభిక్షంలు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆలయాన్ని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, ఐటీడీఏ పీవో రాహుల్, తహశీల్దార్ కేఆర్ కె ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో బాలయ్య, తాళ్లూరి ట్రస్టు చైర్మన్ పంచాక్షరయ్య, ఆలయ ఈవో శేషయ్య, మాజీ జడ్పీటీసీ దంపతులు శ్రీలత, రామకొండారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఇరవెండి మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, సర్పంచ్ పోతునూరి సూరమ్మ, కార్యదర్శి సావిత్రి, ఇతర పార్టీలకు చెందిన నాయకులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## మండల కేంద్రంలో మహాశివరాత్రి

# సాంస్కృతిక కార్యక్రమాలు

**చింతలపాలెం(జనంసాక్షి)**
చింతలపాలెం మండల కేంద్రంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన లైటింగ్ ప్రభల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల నాయకులతో కలిసి చింతలపాలెం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మరియు హుజుర్ నగర్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న మంత్రివర్యులు కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం విద్యా, వైద్యంతో పాటు అన్ని రంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు.రైతులకు నీటి కొరత లేకుండా చేయాలనే లక్ష్యంతో 1450 కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా మహాత్మా గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని తీసుకురావడం ద్వారా చింతలపాలెం మండల అభివృద్ధికి బలమైన పునాది వేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా మండల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మండల రెవిన్యూ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం,పోలీస్ స్టేషన్, నూతన ఆసుపత్రి వంటి కీలక ప్రభుత్వ సదుపాయాలను మంజూరు చేయించడంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృషి అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోర్తాల సీతారెడ్డి,గ్రామ అధ్యక్షుడు దొండపాటి వెంకటరెడ్డి,దేవాలయ చైర్మన్ కారంగుల హుస్సేన్,గ్రామ మాజీ సర్పంచ్ గోనె లక్ష్మి అంకయ్య,కొత్తగూడెం సర్పంచ్ మాలవత్ శారద సామ్య నాయక్,శివగంగా లిఫ్ట్ చైర్మన్ గుడిస వెంకటరెడ్డి,సిపిఐ మండల కార్యదర్శి చింతిరాల రవి, చిత్తలూరి వీరబాబు మరియు కాంగ్రెస్, సిపిఐ పార్టీల వార్డు మెంబర్లు,నాయకులు, కార్యకర్తలు,అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

## న్యూ మిలీనియం హైస్కూల్ లో ఘనంగా ఫేర్వెల్ డే సెలబ్రేషన్స్




సూర్యాపేట(జనంసాక్షి) :
విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించవద్దని న్యూ మిలీనియం హైస్కూల్ కరస్పాండెంట్ బాల్త ధనలక్ష్మీ అన్నారు.శనివారం రాత్రి న్యూ మిలీనియం హైస్కూల్ లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో పాఠశాల విద్య చాలా ముఖ్యమైందని అన్నారు.విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు.గత సంవత్సరం మాదిరిగానే పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత, మార్కులను సాధించి తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తమకు సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ వేడుకలలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాలసుందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## దేవరకొండ మున్సిపల్ వైస్ చైర్మన్ పీఠం

# మొహమ్మద్ యూనూస్‌కు ఇవ్వాలి

### కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సయ్యద్ ఫయాజ్ డిమాండ్



**దేవరకొండ, ఫిబ్రవరి 15(జనంసాక్షి)**
దేవరకొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పదవిని పార్టీ పట్ల అత్యంత విధేయత అపారమైన రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకులు మొహమ్మద్ యూనూస్ కు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ యువ నాయకులు సయ్యద్ ఫయాజ్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యూనూస్ గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తున్న నిఖార్సైన కార్యకర్త అని కొనియాడారు.విద్యార్థి దశలో ఎన్ ఎస్ యు ఐ నుంచి ప్రస్థానాన్ని ప్రారంభించి యూత్ కాంగ్రెస్‌లో కీలక పాత్ర పోషించారని మూడు సార్లు టౌన్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించి పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని ఫయాజ్ గుర్తు చేశారు. ఇప్పటికే రెండుసార్లు వార్డు మెంబర్‌గా గెలిచి ప్రజల మన్ననలు పొందిన యూనూస్, ప్రస్తుతం కౌన్సిలర్‌గా కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందున్నారని తెలిపారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో నలుగురు మైనారిటీ కౌన్సిలర్లు ఉన్న నేపథ్యంలో మైనారిటీ కోటాలో యూనూస్ కు వైస్ చైర్మన్ పదవి ఇవ్వడం రాజకీయంగా పార్టీకి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం వివాదరహితుడైన యూనూస్ కు ఈ పదవి కేటాయించడం ద్వారా మైనారిటీలకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని సయ్యద్ ఫయాజ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## చిరుమర్తిలో భక్తిశ్రద్ధలతో

# మహాశివరాత్రి వేడుకలు

### గజ్జి మధుసూదన్

**మాడుగులపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 15 జనంసాక్షి:**
నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి స్థానిక శివాలయంలో శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు బిల్వార్చనలు నిర్వహించారు. రుద్రాభిషేకాలు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శివలింగానికి ఘనంగా జలాభిషేకాలు పూజలు జరిగాయి శివపార్వతుల కళ్యాణం అర్ధరాత్రి కనుల పండుగ వాతావరణం లో జరిగిన కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పోటెత్తారు అనంతరం అన్నదానం భక్తుల కోసం శ్రీ సోమేశ్వర గార్మిక పరిషత్ ఆధ్వర్యంలో భారీగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.గ్రామస్తుల సహకారంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది ఈ కార్యక్రమంలో శాశ్వత గుడి చైర్మన్ గజ్జి మసూదన్, స్థానిక సర్పంచి కూరేళ్ల నాగమణి వెంకటాచారి, కర్నాటి భాస్కర్, ఉప సర్పంచ్ నాతాల కరుణాకర్ రెడ్డి, యాదయ్య, సైదులు, నాగ చారి, వెంకన్న గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# బంజార జాతిని సన్మార్గంలో నడిపిన మహనీయులు సేవాలాల్ మహారాజ్

## జిల్లా కేంద్రంలో ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు






**సూర్యాపేట(జనంసాక్షి):**
బంజార జాతిని ఐక్యం చేసి సన్మార్గంలో నడిపిన మహనీయుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ మంగ్తా నాయక్, సంత్ శ్రీ సేవాల్ లాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ లానావత్ పాండు నాయక్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని బంజార్ భవన్ లో కో కన్వీనర్ గుగులోతు నాగు నాయక్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. నాడు సంచార జీవనం కొనసాగిస్తున్న లంబాడీలను గిరిజనుల ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహారాజ్ హింస, మద్యపానం, ధూమపానం వంటి వాటిని వీడి ప్రతీ ఒక్కరికి హిందు ధర్మం గురించి చెప్పి వారిని చైతన్యం చేశారని చెప్పారు.లంబాడీలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న వారికి వ్యతిరేకంగా ఆయన ఎన్నో ఉద్యమాలను నిర్వహించారని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించి సెలవుదినంగా ప్రకటించినట్లు గుర్తు చేశారు. పాలకులు లంబాడీలను విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రత్యేక కార్యచరణ తీసుకోవాలని కోరారు. ఇప్పటికైన లంబాడీలు ఐక్యంగా ఉండి మన హక్కులను సాధించుకు నేందుకు ముందుకు సాగాల న్నారు. లంబాడీల సహకారంతో జిల్లా కేంద్రంలో నిర్మాణం చేపట్టిన ఈ బంజార భవన్ పూర్తి నిర్మాణాన్ని ముందుకు సాగించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.అంతకు ముందు సేవాలాల్ మహరాజ్ భోగ్ బండార్ కు ప్రత్యేక నైవేద్యం వండి స్వామివారికి సమర్పించి లంబాడీలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాలు నాయక్, డిప్యూటి తహసీల్దార్ ఎల్.లావణ్య, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, కౌన్సిలర్లు, రాజకీయ పార్టీల నాయకులు, బంజార ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు,వివిధ తండాల నుండి వచ్చిన బంజారాలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



చౌటుప్పల్ ఫిబ్రవరి 15 (జనంసాక్షి)
అతివేగం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి యాక్టివా బలంగా ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధ రైతు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని హనుమాన్ నగర్‌లో నివాసం ఉంటున్న మస్కు మోహన్ రెడ్డి (66) ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో తన టీవీఎస్ ఎక్సెల్ పై వ్యవసాయ పనుల నిమిత్తం తన సొంత గ్రామమైన తంగడపల్లికి వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి చౌటుప్పల్ వస్తుండగా, తంగడపల్లి రోడ్డులోని ఎర్రగోరి వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన యాక్టివా మోహన్ రెడ్డి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోహన్ రెడ్డి కింద పడిపోవడంతో తల వెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధితుడిని 108 అంబులెన్స్‌లో చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి కుమారుడు మస్కు రామ్ రెడ్డి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన చందుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్

## దేవుని గుట్ట తండా సర్పంచ్, గుగులోతు స్వాతి భాస్కర్

తుంగతుర్తి ఫిబ్రవరి 15 (జనం సాక్షి)
గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ అని దేవుని గుట్ట తండా సర్పంచ్ గుగులోతు స్వాతి భాస్కర్ అన్నారు, ఆదివారం మండల పరిధిలోని దేవుని గుట్ట తండాలో సంతు సేవాలాల్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు,ఈ మేరకు సర్పంచ్ స్వాతి భాస్కర్ మాట్లాడుతూ సేవాలాల్ తను ఆచరించిన ఆచరణలో కూడా సేవ సద్గుణాలు పుష్కలంగా ఆచరించి నేటి నవ సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడని అన్నారు, సేవాలాల్ మహారాజ్ కు మారుమూల తండా నుంచి విశ్వవ్యాప్తంగా ప్రపంచ నలుమూలలలో ఆరాధ్య దేవంగా కొనియాడుతున్నారని అన్నారు, ఆయన తండాల్లో తీసుకువచ్చిన ఆధ్యాత్మిక మార్పులు బంజారా ధర్మ పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు, తండాల్లో ఉన్న మూఢనమ్మకాలను పారదోలి గిరిజనుల ను సమాజాన్ని సన్మార్గంలో నడిపించాడని అన్నారు, బంజారా సాంస్కృతి సంప్రదాయాలను బంజారా ధర్మ పరిరక్షణ కోసం ఎనలేని కృషి చేశాడని అన్నారు, బంజారా లు మూఢనమ్మకంతో కృంగిపోతున్న సమాజాన్ని రూపుమాపటానికి అనేక సంస్కరణలు చేపట్టి తండా తండా తిరిగి చైతన్య పరుస్తూ బంజారా జాతిని సన్మార్గంలో నడిపించడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని అన్నారు, అందుకే బంజారా లు సేవాలాల్ మహారాజుని ఆదర్శంగా తీసుకొని ఐక్యమత్యంగా నడవాలని అన్నారు ఈ కార్యక్రమంలో తండావాసులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు

## శివనామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి.

నేరేడుచర్ల (జనంసాక్షి )
.హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ భక్తులు శివనామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా పట్టణంలోని శ్రీ విశ్వేశ్వర దేవాలయంలో,మండలంలోని మూసి నది ఒడ్డున ఉన్న శ్రీ భృగుమాలిక సోమప్ప సోమేశ్వర ఆలయంలో శివనామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి.తెల్లవారు జామున నుండి భక్తులు, పుణ్య స్థానాలు ఆచరించి, ఆలయాలకు చేరుకొని పరమేశ్వరుని దర్శించుకుని అభిషేకాలు,రుద్రాభిషేకం, లింగాభిషేకాలు కుంకుమార్చనలు,రుద్ర హోమాలు, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.సోమప్ప దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్య నారాయణ ,ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్ ఏర్పాటు చేశారు.దాతలు సహాయంతో భక్తులకు మంచినీరు, అల్పా హారం,అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.పెంచికల్ దిన్నే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఎస్ఐ రవీందర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



## చదువుల తల్లి కి ఆసరాగా నిలిచిన ఎన్నారై కుంభం శ్రీనివాస్ రెడ్డి

### ఎంబిబిఎస్ విద్యార్థికి 50 వేల ఆర్థిక సహాయం..

మర్రిగూడ, ఫిబ్రవరి 15 (జనం సాక్షి)
చదువుల తల్లి కి ఆసరాగా నిలిచిన ఎన్నారై కుంభం శ్రీనివాస్ రెడ్డి...మర్రిగూడ మండలం మేటి చందాపూర్ గ్రామానికి చెందిన లపంగి శ్రీను?పార్వతమ్మ దంపతుల కూతురు శివానికి కామారెడ్డి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు లభించింది. పేదరికం కారణంగా చదువు కొనసాగించలేని పరిస్థితిలో ఉన్న విషయం నామాపురం మాజీ ఎంపిటిసి ఊరిపక్క సరిత నగేష్ ఎన్నారై కుంభం శ్రీనివాస్ రెడ్డికి వివరించారు.సేవ భావంతో ఎన్ఆర్ఐ కుంభం శ్రీనివాస్ రెడ్డి ముందుకు వచ్చి శివానికి 50,000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయంతో శివాని చదువు కొనసాగించడానికి సహకరించిన శ్రీనివాస్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరి యాదయ్య (ఆరోగ్య శ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు), గుల్లి నర్సింహ (వార్డ్ మెంబర్), లపంగి భిక్షం, జోగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరమశివుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి



**సూర్యాపేట(జనంసాక్షి):**
సూర్యాపేట మండలం కేసారంలో ఆదివారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఉమామహేశ్వర స్వామి వారి దేవాలయంలో దక్షిణా మూర్తికి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పరమశివుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. తెల్లవారుజాము నుండే స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు.గ్రామ సర్పంచ్ రేఖ రమణ సతీష్ గౌడ్ తో పాటు కాసరబాద్ గ్రామ సర్పంచ్ కోతి గోపాల్ రెడ్డి, దండు మురళీధర్ రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు బత్తుల రంజిత్ గౌడ్, తంగెళ్ల కృష్ణ, బుసిగంపల జానీ, చింత శ్రీను, చింత మట్టయ్య,వెన్న యుగేందర్ రెడ్డి, బుసిగంపల సతీష్, మడ్డి శంకర్, శిరసనగండ్ల శ్రీను,బత్తుల తరుణ్,సంతోష్, బత్తుల వెంకటేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యలను తీర్చడమే తన ధ్యేయం

**- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఆశీర్వాదం**

**- 14 వ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు**

**హుజూర్ నగర్, (జనంసాక్షి):**
పట్టణంలోని 14వ వార్డు ప్రజల సమస్యలను తీర్చడమే తన ధ్యేయమని ఆ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవితబాబురావు అన్నారు. ఆదివారం ఈ సందర్భంగా కౌన్సిలర్ దగ్గుపాటి కవిత మాట్లాడుతూ నీకోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు, జనం కోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావు అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాటలను ప్రజలు రుజువు చేసి చూపించారన్నారు. హుజూర్ నగర్ లో 14వ వార్డు నుండి పోటీ చేసి నామినేషన్ వేసే సమయంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఆశీర్వాదం తీసుకొని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజార్టీతో గెలిచిన అనంతరం పట్టణంలో విజయోత్సవ ర్యాలీలో భాగంగా కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు ధ్రువీకర పత్రాన్ని అంబేద్కర్ పాదాల చెంత ఉంచి ఆశీర్వాదం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## మాడుగులపల్లిలో నరకం చూస్తున్న ప్రయాణికులు

విఫలమయ్యారు మీరు ఇచ్చే హామీలు మాకొద్దు కనీసం మర్యాదగా బస్టాండ్‌లో నిలబడి, ప్రాథమిక అవసరాలు తీర్చుకునే సదుపాయం కల్పించండి చాలు అని స్థానికులు అధికారులను నేతలను సూటిగా టార్గెట్ చేస్తున్నారు.

**బహిరంగ హెచ్చరిక**
ప్రభుత్వ యంత్రాంగం ఇకనైనా కుంభకర్ణ నిద్ర వీడాలి మాడుగులపల్లిలో యుద్ధ ప్రాతిపదికన టాయిలెట్స్ నిర్మించడంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించకపోతే, ప్రయాణికులతో కలిసి రాజకీయ నాయకులను గల్లా పట్టి నిలదీస్తామని స్థానిక యువత, ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఏసీ గదుల్లో కూర్చునే అధికారులకు విలాసవంతమైన భవనాల్లో ఉండే నాయకులకు సామాన్యుడి కష్టం ఎప్పుడు తెలుస్తుంది.